కాలువల వద్ద జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర - వై.రామవరం: రానున్న రెండు మూడు రోజోలు వర్షాలు ఉన్నందున ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీవో కె.బాపన్న దొర సూచించారు. ఆదివారం పంచాయితీ కార్యదర్శులు, సచివాలయం, ఇతర సిబ్బందికి కొండ కాలువల వద్ద గస్తీ విధులు అప్పగించారు. ప్రజలు ఇల్ల వద్ద ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

ప్రజలంతా సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్నటువంటి వర్షాల పట్ల నియోజకవర్గంలోని ముంపు మండలాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీష దేవి ఆదివారం ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. వాగులు వంకలు పొంగిపొర్లుతున్నా నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పేర్కొన్నారు. నాలుగు మండలాల అధికారులను అప్రమత్తం చేస్తూ ఏ సమస్య వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. మేము ప్రజలందరికీ అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు.

సోకులేరు బ్లాక్ పాయింట్‌ను ఐటీడీఏ పీవో సందర్శన

విశాలాంధ్ర-చింతూరు : ఐటీడీఏ పిఒ అపూర్వ భరత్ సోకిలేరు బ్లాక్ పాయింట్‌ను సందర్శించారు. హెల్త్ ఎమర్జెన్సీ పరిస్థితిలో ప్రజలు దాటడానికి ఒక బోట్‌ను కూడా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆ బ్లాక్ పాయింట్ నందు ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ మరియు రెవెన్యూ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్‌ని కేటాయించారు. ప్రతి బ్లాక్‌పాయింట్ వద్ద సచివాలయం స్టాఫ్‌ని కేటాయించే విధంగా తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. చుటూరు వద్ద చేపలు పడుతున్న ప్రజలతో ప్రాజెక్టు అధికారి నేరుగా మాట్లాడి జాగ్రత్తగా ఉండవలెనని సూచించారు.

పర్యాటక ప్రదేశాలు మూసివేత

విశాలాంధ్ర-చింతూరు : చింతూరు అటవీ డివిజన్‌లోని అన్ని పర్యాటక ప్రదేశాలను మూసివేసినట్లు డీఎఫ్వో బబిత తెలిపారు. అటవీ డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజ్లో గల పోల్లూరు జలపాతం, సోకిలేరు వ్యూ పాయింట్లతో పాటు ఇతర సందర్శన ప్రదేశాలను తుఫాన్ నేపథ్యంలో మూసివేయడం జరిగిందన్నారు. ఏజెన్సీలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రాంతాల్లో వరద నీరు ఎక్కువగా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నమన్నారు. అదేవిధంగా వాగులు, వంకలు, జలపాతాలు సందర్శించాటానికి పర్యాటకులు ఎవరు రావద్దని వచ్చి ఇబ్బందులు గురికావద్దని డీఎఫ్ఒ తెలిపారు.

ముంపు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులందరూ అందుబాటులో ఉండాలి
- కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : భద్రాచలం, శబరి నదులలో నీటి మట్టాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో చింతూరు డివిజన్ పరిధిలోని ముంపు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ముంపు మండలాల్లోని మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారులు అందరూ నిరంతరమూ అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. రానున్న నాలుగైదు రోజులపాటు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో బోట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగక ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వారం రోజులకు సరిపడా రేషన్ సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున కిరోసిన్ కొవ్వొత్తులు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా మండలాలలో గర్భిణీలను గుర్తించి బర్త్ వెయిటింగ్ హాల్స్‌కు తరలించాలని, అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నదులు పొంగడంతో పాటు వర్షాలు కూడా కురుస్తున్నందున ప్రజలు నదులు వాగులు దాటకూడదని, చేపల వేటకు వెళ్ళరాదని కలెక్టర్ సూచించారు. ఎప్పటికప్పుడు నీటిమట్టాలను సేకరించి ప్రజలను అప్రమత్తం చేయాలని, వరదలు వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు చేరవేయాలని ఆదేశించారు. పాడు పడిన భవనాలు, విద్యుత్ స్తంభాలు, చెట్ల వద్ద చేరరాదని కలెక్టర్ సూచించారు.

గోమంగి బ్రిడ్జికి పడిన రంధ్రం

ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర-పెదబయలు : గోమంగి బ్రిడ్జి తక్షణమే నిర్మాణం చేపట్టి గిరిజనులకు రవాణా ఇబ్బంది లేకుండా చూడాలని నూతన బ్రిడ్జి నిర్మించేంత వరకు ప్రస్తుత బ్రిడ్జిని మరమ్మత్తులు చేపట్టాలని స్థానిక జెడ్పిటిసి కూడ బొంజుబాబు గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కే రాధాకృష్ణ , డిమాండ్ చేశారు ఆదివారం గోమంగి మద్దిగరువు ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి మధ్యలో రంధ్రం పడటంతో రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలుసుకున్న జడ్పిటిసి బొంజుబాబు గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ హుటాహుటిన గోమంగి బ్రిడ్జి సందర్శించరు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి రంధ్రం కావడంతో గిరిజనులు రాకపోకలకు త్రీవ అంతరాయం కలిగి ఇబ్బందులకు గురవుతున్నారని పెదబయలు జి.మాడుగుల మండలలా సుమారు 30 పంచాయతీల ప్రజలకు ఉపయోగపడే బ్రిడ్జి సగం కూలిపోవడంతో నడిచి వెళ్లడానికి కూడా ప్రజలు భయం భయంతో బ్రిడ్జి దాటవలసిన పరిస్థితి ఏర్పడిందని, పాడేరు నుండి బొంగరం వరకు వెళ్లే బస్సు బ్రిడ్జి మధ్యలో రంధ్రం పడడంతో జిమాడుగుల మీదుగా తిరిగి వెళ్లవలసిన పరిస్థితి వచ్చిందని ప్రతిరోజు పలువురు ఉద్యోగస్తులు ఈ బస్సుని ఆధారపడి తమ ఉద్యోగాలకు హాజరవుతుంటారని ఈ బ్రిడ్జి రంధ్రం కావడంతో ఉద్యోగులు గిరిజనలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని వారు అన్నారు గత రెండు సంవత్సరాల క్రితం బ్రిడ్జి పాడైందని అనేకమార్లు పత్రికల్లో వార్తలు వచ్చిన కనీసం అధికారులు స్పందించకపోవడమే మరింత బ్రిడ్జి కూలి పోవడానికి దారితీసిందని, ఈరోజు బస్సు వెళు తున్న సమయంలో పెద్ద పెను ప్రమాదం తప్పిందని బస్సు ముందుకు వెళ్లిన వెంటనే బ్రిడ్జి రంధ్రం పడిందని పెను ప్రమాదం తప్పి జనాలు

ఊపిరి పీల్చుకున్నారని అన్నారు అదేవిధంగా వర్షాకాలం లో బ్రిడ్జి తక్కువ ఎత్తుగా ఉండడంతో గడ్డ బ్రిడ్జి పైనుండి పొంగిపొర్లుతుండడం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారులు స్పందించి బ్రిడ్జిని తక్షణమే నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సత్తిబాబు కే.బాలరాజు ప్రవీణ్, జంపరంగి తిరుపతిరావు, కొంట రామారావు, బొండ విజయ్, లాలిబాబు, శేఖర్, శెట్టి రవికుమార్, భగీరథ రావు, జర్సింగి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిఓ ఆదేశాలతో ఆర్వో ప్లాంట్ మరమ్మతులు : ఏటిడబ్ల్యూఓ

విశాలాంధ్ర-దుంబ్రిగుడ : మండలంలోని జాంగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మరమ్మతుకు గురైన ఆర్ఓ ప్లాంట్‌ను ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు స్థానిక ఏటిడబ్ల్యూఓ మల్లికార్జున్ పర్యవేక్షణలో అదివారం మరమ్మత్తు పనులు హుటాహుటిన చేసి వినియోగంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఏటిడబ్ల్యూ మల్లికార్జున మాట్లాడుతూ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ శనివారం జాముగూడ ఆశ్రమ పాఠశాలను సందర్శించి శుక్రవారం విద్యార్థులు తీసుకున్న కలుషిత ఆహారం జరిగిన సంఘటనపై అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన మాట ప్రకారం అర్వో ప్లాంట్ మరమ్మతులు చేయించడం జరిగిందన్నారు. నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం ఐటిడిఏ పిఓ చొరవతో వినియోగంలోకి తీసుకురడం జరిగిందన్నారు. అదేవిధంగా తాగునీటి అవసరాలకు, వంటలకు సురక్షితమైన నీటిని వినియోగించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఏటిడబ్ల్యూ ఆదేశించారు. ఆర్ఓ ప్లాంట్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యపై ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయురాలు సుజాతను ఆదేశించారు.

పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి సందర్శన

విశాలాంధ్ర-అనంతగిరి : దుంబ్రిగుడ మండలంలోని జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి ఆదివారం సందర్శించారు. మెనూ సక్రమంగా ఉందో లేదో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో కనీస వసతులు కొరవడ్డాయని, సురక్షితమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడు లేరని, సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి ముందు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అసౌకర్యాల వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు వాపోయ్యారని తెలిపారన్నారు. పాఠశాలలో పూర్తి స్థాయిలో వసతి సౌకర్యంతో పాటు సరైన మౌలిక సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకునేలా, సమస్యలు పరిష్కరించే విధంగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆమె తెలిపారు. అనంతరం అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్న దోకులూరు గ్రామ ప్రజలు

విశాలాంధ్ర-జీకే విధి : గూడెం కొత్త వీధి మండలం పెదవలస పంచాయతీ దొకలూరు గ్రామంలో 15 సంవత్సరాల క్రితం నిర్మించిన మంచినీటి ట్యాంకులోకే కలుషితమైన నీరు చేరడంతో ఆ మంచినీటి తాగి అనారోగ్యానికి గురవుతున్నమనీ గ్రామస్తులు తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం జలజీవన్ మిషన్ పథకం మంజూరు కావడం జరిగిందని, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆ పనులు జరగటం లేదని వాటర్ ట్యాంక్ కూడా నిర్మాణం జరగలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకులో నీరు కలుషితం కాకుండా, జలజీవన్ మిషన్ పథకం, ద్వారా మంజూరైన మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి ఇంటింటి కొలాయి, సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

నేడు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు

విశాలాంధ్ర బ్యూరో -పాడేరు: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈనెల 2వ తేది సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు, ప్రభుత్వ శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. ఇంటర్మీడియట్ డిగ్రీ కళాశాలలకి కూడా సెలవు ప్రకటించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు కూడా విధిగా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సెలవును గమనించి పిల్లలను పాఠశాలకు పంపించరాదని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ పిల్లలు వాగులు గడ్డలు దాటరాదని కలెక్టర్ సూచించారు.

మంత్రి నారా లోకేష్‌ను కలిసిన సర్పంచ్ బొజ్జిబాబు

విశాలాంధ్ర-జీకే వీధి : విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో, ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబును దేవరపల్లి సర్పంచ్ సిరబాల బొజ్జిబాబు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.. సర్పంచ్ బొజ్జిబాబు మాట్లాడుతూ దేవరపల్లి పంచాయతీ, మండల సమస్యలపై విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందన్నారు. వాటన్నిటి పై సమస్యలు విన్న విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సానుకూలంగా స్పందించి పంచాయతీ, మండల సమస్యలను పరిష్కరించే దిశగా హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు.

కొత్తవలస వద్ద సీతానగరం ఆనకట్టను కలెక్టర్ పరిశీలన

- డ్యాం పైనుండి గ్రామస్తుల రాకపోకలను నిలుపుదల చేయండి
- కలెక్టర్ ఆదేశాలు

విశాలాంధ్ర-సీతానగరం : బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీవర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నదీపరివాహక ప్రాంతప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొత్తవలస గ్రామ పంచాయతీ పరిధిలో సువర్ణముఖి నదిపై ఉండే సీతానగరం ఆనకట్ట డ్యామ్ వద్ద నీటి ప్రవాహంను ఆయన పరిశీలించారు. ఉధృతంగా డ్యాంపై నుండి నీరు ప్రవహిస్తున్నందున కొత్తవలస నుండి గ్రామస్తుల రాకపోకలను నిలుపుదల చేసి ముందస్తు అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని పుట్టూరు కాజ్ వే, మండలంలోని కొత్తవలస డ్యామ్ వద్ద వరద నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు.ఆయన మాట్లాడుతూ సువర్ణముఖినది పరివాహక ప్రాంతమైన కొత్తవలస డ్యామ్ వద్ద రోడ్డుపై ప్రమాద స్థాయిలో నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నందున కొత్తవలస - బగ్గందొరవలస ,మక్కువ గ్రామ ప్రజల రాకపోకలను నిలుపుదల చేయాలని తహాశీల్దార్ జె.రాములమ్మను ఆదేశించారు. రాకపోకలు జరగకుండా డ్యామ్ కు వెళ్ళే మార్గంలో

తవ్విన ట్రెంచ్ ను చూసారు. పశువులు, జాలరులు, ప్రజలు అటువైపు వెళ్లకుండా డ్యామ్‌కు ఇరువైపులా రెవిన్యూ సిబ్బందిని నియమించి అప్రమత్తం చేయాలని సూచించారు. డ్యామ్‌వద్ద ప్రస్తుత ప్రమాదకర పరిస్థితిని అక్కడ ప్రజలకు కలెక్టర్ తెలియజేసారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. సీతా నగరం మండలంలో సువర్ణముఖినది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు కూడా నదిలో దిగవద్దని సూచించారు.

పుట్టూరు కాజ్‌వేను పరిశీలన : పార్వతీపురం మండలంలోని పుట్టూరు కాజ్‌వేను కలెక్టర్ పరిశీలన చేసారు. రోడ్డుపై వరద నీరు ప్రవాహానికి గల కారణాలను రైతులను అడిగితెలుసుకున్నారు. కాజ్ వే ఎత్తు తక్కువగా ఉండటం వలనభారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతం నుండి నేలకొరిగిన చెట్ల కలప వస్తుండడంతో మూసుకుపోతుందని రైతులు తెలిపారు. దీని కారణంగా నీటి ప్రవాహం సాఫీగా జరుగక రోడ్డుతోపాటు పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం ఆర్డీఓ కె.హేమలత, సీతానగరం తహాశీల్దార్ రాములమ్మ,ఉప తహాశీల్దార్ ఏ. ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీనుబాబు, కొత్తవలస, బగ్గందొరవలస గ్రామ రెవెన్యూ అధికారులు కె.శ్రీదేవి, ఎస్.సునీల్, కొట్టవలస, బగ్గందొరవలస పంచాయతీ కార్యదర్శిలు గౌతమి, శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి : ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన హిడెన్ కెమెరా ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గుడ్లవల్లేరు ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయవలసిన ప్రభుత్వం ఆవిధంగా అడుగులు వేయడం లేదని విమర్శించారు.దాదాపుగా 300 మందికి పైగా విద్యార్థులు వీడియోలు బయట తిరుగుతున్నయిని విద్యార్థులు ఆవేదన పడుతుంటే, అసలు ఘటనే జరగలేదు అని ప్రకటించడం సిగ్గుచేటు అన్నారు.ఈ విషయంలో పూర్తిస్థాయి యాజమాన్యం నిర్లక్ష్యం ఉండడం వల్లే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ప్రభుత్వాలు చూడవలసింది పార్టీలు కాదని, విద్యార్థుల భవిష్యత్తు అని, వాళ్ల ఆత్మ అభిమానాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. విద్యార్థులు అనిచవేత కుట్రలు ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు, లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

వర్షాలకు కూలిన పెంకిటిల్లు

విశాలాంధ్ర-పాచిపెంట : పాచిపెంట మండలం కర్రివలస గ్రామంలో రాత్రి ఏడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కర్రీ వలస గ్రామంలో పెంకిటిల్లు గోడ పడిపోయింది. వర్షం పడుతున్న రాత్రి పడాల కామేశ్వరరావు సత్యవతి దంపతులు ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో పెంకుటిల్లు గోడలు పక్కకు పడటంతో పెద్ద శబ్దం రావడం తో నిద్రిస్తున్న వారు ఇంటినుండి బయటకు రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు ఆ కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొత్తవలసలోని చెత్తసంపద కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలన

విశాలాంధ్ర-సీతానగరం : చెత్తనుండి సంపదతయారు చేసే కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయితీ కార్యదర్శి కె.గౌతమిని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఆదివారం కొత్తవలస డ్యామ్ వద్దకు విచ్చేసిన కలెక్టర్ ప్రక్కనేగల కొత్తవలస గ్రామపంచాయతీ చెత్తనుండి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. చెత్త నుండి సంపద కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడం, నిర్వహణ లోపానికి గల కారణాలపై ప్రశ్నించి అసహనాన్ని వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 15నుంచి చెత్త నుండి సంపద కేంద్రాన్ని వినియోగంలో తీసుకురావాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమ లత, తహాశీల్దార్ రాములమ్మ,ఉప తహాశీల్దార్ ఏ. ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎన్. శ్రీనుబాబు, కొత్తవలస, బగ్గందొరవలస వీఆర్వోలు కె.శ్రీదేవి, ఎస్.సునీల్, పంచాయతీ కార్యదర్శులు గౌతమి, మోహనరావు, శ్రీనివాసరావు తదితరులు, పాల్గొన్నారు.

నదితీర ప్రాంతాలను అధికారులు పరిశీలన

విశాలాంధ్ర-వీరఘట్టం : మండలంలోని పనస నందివాడ, కిమ్మీ గ్రామాలను ఆదివారం స్థానిక ఎస్సై జి కళాధర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణనాయుడులు పర్యటించారు. కురుస్తున్న వర్షాలు కారణంగా వరదలు వచ్చే అవకాశం ఉందని వీటిని దృష్టిలో పెట్టుకుని రాత్రి సమయంలో నది వద్దకు వెళ్ళవద్దని గ్రామస్తులకు సూచించారు. నాటు పడవ ప్రయాణం నిలుపుదలు చేయాలని నిర్వాహకులకు హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జి రామ్మోహన్రావు, వీఆర్వోలు జి అప్పలనాయుడు, సురేష్ కుమార్, గ్రామ పెద్దలు కె రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సామాజిక భవనంలో రక్తదాన శిబిరం : ఎమ్మెల్యే జయకృష్ణ

విశాలాంధ్ర-సీతంపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 02-09-2024 అనగా సోమవారం పాలకొండ నియోజక వర్గం శాసన సభ సభ్యులు నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో సీతంపేట కమ్యూనిటీ హాల్ నందు నిర్వహిస్తున్న బ్లడ్ డొనేషన్ క్యాంప్ (రక్తదాన శిబిరం) నకు నియోజక వర్గం లోని పార్టీ కార్యకర్తలు మరియు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు అని తెలిపారు.

వర్షాల కారణంగా నేడు గ్రీవెన్స్ రద్దు: కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : భారీ వర్ష సూచనల మేరకు సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్ష సూచన ఉందని, ఇతర ప్రాంతాల నుండి రావడంలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వాగులు, వంకలు పొంగి పొర్లె అవకాశం ఉందని, వాటిని దాటుకుని వచ్చే పరిస్థితులు ఉంటాయని, ప్రజలు ఇంటివద్దనే సురక్షితంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. అనవసర వ్యయప్రయాసలకు లోనై గ్రీవెన్స్ కు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని 15 మండలాల ప్రజలు దీనిని గమనించాలని కోరారు.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి

ఏఐఎస్ఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన హిడెన్ కెమెరా ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుడ్లవల్లేరు ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయవలసిన ప్రభుత్వం ఆ విధంగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. దాదాపుగా 300 మందికి పైగా విద్యార్థుల వీడియోలు బయట తిరుగుతున్నాయని విద్యార్థులు ఆవేదన పడుతుంటే, అసలు ఘటనే జరగలేదని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ విషయంలో పూర్తిస్థాయి యాజమాన్యం నిర్లక్ష్యం ఉండడం వల్లే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ప్రభుత్వాలు చూడవలసింది పార్టీలు కాదని, విద్యార్థుల భవిష్యత్ అని, వాళ్ల ఆత్మాభిమానాన్ని దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. విద్యార్థుల అణచివేత కుట్రలు ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు, లేనియెడల ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

వేడుకగా దృశ్యభాష అవిష్కరణ

విశాలాంధ్ర-సాలూరు : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రాసిన దృశ్యభాష పుస్తకాన్ని ఆదివారం సాలూరు లో సాహితీ మిత్రబృందం వారు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణమండపంలో సాలూరు సాహితీ మిత్రబృందం సభ్యులు ఏర్పాటు చేసిన 89 వ సాహితీ సభలో పలువురు ప్రముఖులు పాల్గొని తమ సందేశాన్ని అందజేశారు. ప్రముఖ సాహితీవేత్త సీనియర్ జర్నలిస్ట్ జంధ్యాల శరత్‌బాబు మాట్లాడుతూ చిన్నతనం నుండే పిల్లలలో సాహితీ విలువలు పెంపొందించాలన్నారు. తెలుగుభాష మధురమైనదన్నారు. తేనెలూరే తెలుగులో అనేక రచనలు,అవిష్కరణలు జరిగాయన్నారు. తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే ఆర్.పి.భంజ్‌దేవ్ చేతుల మీదుగా యిందుపూరి రామనారాయణ,మురళీకృష్ణ స్మారక అష్టమ సాహితీ పురస్కారాన్ని యస్‌కోటకు చెందిన వట్రాయుడు కాశీ విశ్వనాథం, గుమ్మా నాగమంజరి దంపతులకు అందించారు.అలాగే వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందించారు. సాహితీ మిత్రబృందం వ్యవస్థాపక అధ్యక్షుడు జె.బి.తిరుమలాచార్యులు మాట్లాడుతూ తెలుగు భాషను, సంస్కృతి కాపాడుకోవాలన్నారు.సాహితీ సభలు ప్రతీ వాడలో జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు సాహితీ మిత్రబృందం అధ్యక్షుడు శేషాద్రి సోమయాజులు (శేష మాష్టారు),కార్యదర్శి ఆకుల గణపతి, సాహుకారి చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి హయాంలో గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

విశాలాంధ్ర-కురుపాం : ఎన్నికలు హామీలో భాగమైన గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కూటమి ప్రభుత్వం హాయాంలో పూర్తి చేస్తామని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. ఆదివారం సీతంపేటలో గుమ్మడిగెడ్డ రిజర్వాయర్ కుడి కాలువనీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కురుపాం బహిరంగసభలో గుమ్మడిగెడ్డ రిజర్వాయర్ పూర్తి చేస్తామని ప్రకటించారని ఆ హామీ, దశాబ్దాల రైతులు కల కూటమి ప్రభుత్వం హాయాంలో పూర్తిచేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ మాట్లాడుతూ గతంలో మూడు సార్లు గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ రాజకీయ కారణాలవల్ల నిర్మాణానికి నోచుకోక నిధులు వెనక్కి వెళ్ళిపోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాయాంలో గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం జరిగి రైతులు సాగు నీరు సమస్యలు తీర్చడానికి అందరం సమన్వయంతో పనిచేస్తూ కృషి చేస్తామని తెలిపారు.మండల కన్వీనర్ కెవి కొండయ్య, రైతులు బంటు వెంకటనాయుడు, మర్రాపు సింహాచలం, ఆయకట్టు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరి శిఖర రహదారుల్లో జారి పడుతున్న కొండచరియలు

విశాలాంధ్ర-కురుపాం : ఇటీవల కురిసిన వర్షాలకు మండలం లోని గిరి శిఖర రహదారుల్లో కొండచరియలు విరిగి పడిపోతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం జరడ పంచాయతీ లో ప్రధాన రహదారి పై కొండచరియలు విరిగి పడిపోతే ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి క్షేత్ర స్థాయిలో సందర్శన చేసి పరిశీలించారు.తాజాగా ఆదివారం ఉదయం జి.శివడ పంచాయతీ కోరుకొండ రహదారి లో కొండచరియలు విరిగి పడ్డాయి.ప్రజలు అప్రమత్తం ఉంటూ ఎలాంటి ప్రమాదాలు కు గురి కావద్దు అని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ప్రభుత్వ అధికారులు సూచించారు.

కూలిన కల్వర్టుతో ఇబ్బందులు

విశాలాంధ్ర-జీకే వీధి : అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీ చెలకవీధి గ్రామంలోని ప్రజలు కాలువ దాటుటకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంవల్ల కల్వర్టు కూలిపయిందని, వర్షాకాలంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రస్తుతం తుఫాను ప్రభావంతో జోరుగా వర్షాలు కురుస్తూ ఉండడంతో కాలువలు దాటే పరిస్థితి లేదని పాఠశాలకి పిల్లలను పంపేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి విధంగా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఐటీడీఏ పిఓ

విశాలాంధ్ర-రాజవొమ్మంగి: బంగాళా ఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగు తుండటంతో వాగుల చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంప చోడవరం ఐటీడీఏ పిఓ కట్టా సింహాచలం తెలిపారు. ఆయన ఆదివారం గంగవరం మండలం నెల్లిపూడి వాగు, అడ్డతీగల మండలం పలుకురాతిపాలెం వాగు, రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ వాగుని పరిశీలించారు, ప్రజలు వాగులు దాటే ప్రాంతాలలో రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామని, రంపచోడవరం సబ్ కలెక్టర్, ఐటీడీఏ కార్యాలయల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం జడ్డంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రాజవొమ్మంగి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపిడిఓ యాదగిరీశ్వరావు, సీఐ సన్యాసినాయుడు, డిప్యూటి తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారూ... పాత్రుని కోనేరును అభివృద్ధి చేయండి

జగన్నాథపురం వాసుల అభ్యర్థన

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీలోని జగన్నాథపురం లో ఉన్న పాత్రుని కోనేరు ను అభివృద్ధి చేయాలని జగన్నాథపురం వాసులు స్థానిక శాసనసభ్యులు బోనెల.విజయ చంద్రను ముక్తకంఠంలో అభ్యర్థిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే ఈ కోనేరును ఈ ప్రాంతంలో నివసిస్తున్న రాయఘురు కుటుంబీకులు ఇక్కడ నిర్మించారని ఈ కోనేరుకు ఆనాటి నుంచి ఈనాటి వరకు ప్రత్యేక ప్రాముఖ్యత కలిగి ఉందని స్థానికులు చెబుతున్నారు.ఈ కోనేరుకు ఆనుకొని త్రినాధ స్వామి ఆలయం ఉన్నదని కార్తీక మాసంలో ఈ కోనేరులో స్నానాలు చేసి దైవ దర్శనం స్థానికులు చేసుకునేవారని అలాంటి కోనేరు ఇప్పుడు ఆక్రమణలకు గురై కలుషితమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఈ కోనేరు అభివృద్ధికి 40 లక్షల వరకు నిధులు మంజూరు అయ్యాయని పనులు మొదలు పట్టడం జరుగుతుందని అధికారులు హడావిడి చేశారని ఆ నిధులు ఏమయ్యాయో అర్థం కాలేదు అన్నారు.స్థానిక శాసనసభ్యులు దృష్టి సారించి ఈ కోనేరు ను పరిశీలించి నిధులు విడుదల చేసి రాయఘురు కుటుంబీకుల పేరును, పాత్రుని కోనేరు ప్రాముఖ్యతను నిలబెట్టాలని జగన్నాథపురం వాసులు ముక్తకంఠంగా కోరుతున్నారు.

అన్నవరం వైద్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి పరిశీలన

విశాలాంధ్ర-పాలకొండ : మండలం అన్నవరం గ్రామంలో ఉన్న పీహెచ్ సి ని ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డా. కె.విజయ పార్వతి తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నవరం పీహెచ్సిలో వున్న రికార్డు లూ,రోగులకు అందుతున్న సేవలను,డ్యూటీ రోస్టర్ నీశీ తంగా పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేసియున్నారు. వరదలు భారీ వర్షాలు తుఫాన్ హెచ్చిరా కలు నేపథ్యం లో, విద్యుత్ సరఫరా, అత్యవసర మందులు, పాము కాటు,కుక్క కాటు వాక్సిన్ మందుల స్టోర్, బయో మెడికల్ వేస్ట్ స్టోరేజ్, గర్భిణీ స్త్రీలను వైటీసీ సెంటర్ తరలింపు తదితర అన్ని అంశాలు క్షుణ్ణంగా పరిశీలించి ముందస్తు చర్యలపై తగు ఆదేశాలు జారీ చేసారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. కమల్‌నాథ్ సూపర్ వైజర్ బి జగన్నాధరావు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత ఆహార ఘటనపై సంబంధిత శాఖపరమైన అధికారులతో విచారణ పక్కదారి

విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపణ

విశాలాంధ్ర-దుంబ్రిగూడ : జాముగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన కలుషిత ఆహార ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలు బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి ఐ.టి డి.ఏ. పి.ఓ అభిషేక్ విచారణ కమిటీని నియమిస్తామని ప్రకటించారు. ఈ కమిటీలు ఐటిడిఏ డిడి మండల ఏటిడబ్ల్యూ ఎంపీడీవో తహసిల్దార్ నలుగురితో కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా విచారణ చేపడతామని శనివారం జాముగుడ బాలికల పాఠశాలలో సందర్శించి ప్రకటించారు. అయితే ఆశ్రమ పాఠశాలలను పర్యవేక్షించే అధికారులైన డిడి, ఏటిడబ్ల్యూఓ విచారణను సమగ్రంగా చేపట్టకుండా నీరుగార్చే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఆ పాఠశాలలో అనేక ఘోరమైన సంఘటనలు జరిగి కొన్ని సంఘటనలపై సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకోకుండా సంబంధిత అధికారులు అనుకూలంగా వ్యవహరించినట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలుషిత ఆహారం తిని సుమారు వందమంది పైచిలుకు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఈ సంఘటనపై కూడా నీరు గార్చే పరిస్థితి ఉంటుందని దీని కారణంగా విద్యార్థుల ఇటువంటి న్యాయం జరగదని తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. అధికారులు ప్రకటించిన ఈ కమిటీపై పునరాలోచించి భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కమిటీలో మార్పు చేయాలని విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలో గల వైటీసీ లో వున్న గర్భిణీ సంరక్షణ కేంద్రాన్ని నేడు పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారిణి డాక్టర్ కె. విజయ పార్వతి తనిఖీ చేసి యున్నారు. ఈ సందర్భంగా అక్కడ వున్న రికార్డులూ, సేవలు, ఆహార నియమావళి, డ్యూటీ రోస్టర్ నీశీతంగా పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేసి యున్నారు గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, వారికి అందిస్తున్న పౌష్టిక ఆహారంపై

గర్భిణి స్త్రీల వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

జర్నలిస్టుల కోసం చేసే హామీ... నెరవేరదేమి...

చింతపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు ఖాసింవల్లి

విశాలాంధ్ర-చింతపల్లి : ఎటువంటి వేతనాలు లేకున్నా, నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం, ఆయా ప్రాంతాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్రాలలో ఏలుబడి సాగించిన ఎన్నో ప్రభుత్వాలు పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇస్తామని హామీలు గుప్పించడం తప్ప వాటిని అమలు చేయడంలో మీన మేసాలు లెక్కిస్తున్నాయని చింతపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు షేక్ ఖాసిం వల్లి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అటు రాజకీయ పార్టీలు అధికారంలోకి రావాలన్నా, ప్రతిపక్షంలోకి పడిపోవాలన్నా ముఖ్య భూమిక పాత్రికేయులదేనన్నారు. ప్రజా ప్రతినిధులు గాని, అధికారులు గానీ ఏ కార్యక్రమం తలపెట్టినా, దానిని ప్రజలకు చేరవేసేది పాత్రికేయులే అన్నారు. అటువంటి పాత్రికేయుల అవసరం ప్రతి ఒక్కరికి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు, పాలకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏనాడు దృష్టి పెట్టలేదన్నారు. పత్రికా యాజమాన్యాల నుండి పాత్రికేయులకు కనీస వేతనం లేదన్న విషయం పాలకులు, అధికారులకు తెలిసిందే అన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ తాము అధికారంలోకి వస్తే పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇస్తామని హామీలు గుప్పించడం తప్ప గడచిన రెండు, మూడు దశాబ్దాలుగా మారిన ప్రభుత్వాలన్నీ ఆ హామీలను అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఈ విషయాన్ని మేనిఫెస్టోలో పెట్టి కూడా విస్మరించిందన్నారు. ప్రతి విషయాన్ని వెలుగులోకి తెచ్చేందుకు పాత్రికేయులను ఉపయోగించుకునే పాలకులు, అధికారులు పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టకపోవడం దురదృష్ట కరమన్నారు. యాజమాన్యాలు ప్రకటనల పేరుతో టార్గెట్ లు నిర్ణయిస్తున్నా, కనీస వేతనం లేదని కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తున్నా, బ్రతుకు భారమై ఆర్థిక ఇబ్బందులు వెంటాడు తున్నా, నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక, వేరే వృత్తిలో ఇమడలేక, పాత్రికేయులకు ప్రభుత్వాలు ఏవైనా అవకాశాలు కల్పిస్తాయనే నమ్మకంతో ఏళ్ల తరబడి పాత్రికేయ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు కేటాయించి, గృహాలు నిర్మించి ఇస్తామని నమ్మబలకడంతో కనీసం కుటుంబానికి గృహం ఏర్పాటు అవుతుందన్న ఆశతో పాత్రికేయులు ఈ వృత్తిలో కొనసాగుతున్నారన్నారు. ప్రతి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇస్తూ, అధికారం చేపట్టిన తరువాత ఆ ఊసే మరచి ఆఖరు నిమిషంలో పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేయాలి. గృహాలు నిర్మించి ఇవ్వాలి అనే విషయాన్ని తెర మీదకు తేవడం, ఇంతలో ఎన్నికల షెడ్యూలు విడుదలై విలేకరుల స్థల కేటాయింపు, గృహాల నిర్మాణం విషయం వెనకకు వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రాలలో అధికారం చేపట్టిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి ఈ (అధికారం చేపట్టిన) ఏడాదిలోనే కృషి చేయాలని, పాత్రికేయుల తరపున ఆయన కోరారు.

వినాయక చవితి మండపాలకి అనుమతులు తప్పనిసరి

విశాలాంధ్ర-కొమరాడ : ఈనెల ఏడో తేదీన జరగబోయే వినాయక చవితి పండగ సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలకు అనుమతులు తప్పనిసరి తీసుకోవాలంటూ ఆయన అన్నారు ఈ సందర్భంగా ఎస్సై కే నీలకంఠం ఆదివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మన్యం జిల్లా ఎస్పీ ఎస్ వి. మాధవ్ రెడ్డి, ఆదేశాల ప్రకారం గణేష్ ఉత్సవ సింగిల్ విండో మేరకు వినాయక చవితికి సంబంధించి కీలక సూచనలు చేశారు. సింగిల్ విండో ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్త గణేష్ ఉత్సవ అనుమతి లింక్: https://ganeshutsav.net/ లేదా అనుమతి కోసం మిస్డ్ కాల్ ఇవ్వండి 79950 95800 రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ, మునిసిపల్, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్‌శాఖ అధికారులతో కూడిన సింగిల్ విండో వ్యవస్థను అమలు చేయడం ప్రారంభించాలని యూనిట్ అధికారులందరినీ అభ్యర్థిస్తున్నారు. స్పాట్ విజిట్ మరియు వెరిఫికేషన్ తర్వాత, నిర్వాహకులకు క్యూఆర్ కోడ్‌తో పాటు ఎన్ఓసి జారీ చేయబడుతుంది. ఈ క్యూఆర్ కోడ్ను పండల్లకు అతికించాలి మరియు బీట్ చెకింగ్ పోలీసు అధికారులచే స్కాన్ చేయబడుతుంది. ఇది భద్రతా చర్యలను ట్రాక్ చేయడంలో మాకు సహాయపడుతుంది. స్కాన్ చేసిన తర్వాత అన్ని విగ్రహాలు జియోట్యాగ్ చేయబడతాయి. ఈ సిస్టమ్ నిమజ్జనం తేదీ మరియు స్థలం, విగ్రహం ఎత్తు మరియు నిర్వాహకుడి వివరాలు వంటి మొత్తం సమాచారాన్ని ఒకే చోట సంకలనం చేస్తుంది. ప్రజలందరూ ఈ వాట్సాప్ నంబర్ 7995095800 (హాయ్ అని పంపడం) లేదా వెబ్‌లింక్ https://ganeshutsav.net/ ఉపయోగించి దరఖాస్తు చేయమని వారిని ప్రోత్సహించవచ్చు. పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు, పోలీస్ వారు అందిస్తున్న ఈ గణేష్ ఉత్సవ అనుమతి లింక్‌లను ఉపయోగించి తద్వారా సింగిల్ విండో సిస్టమ్ కు ఉపయోగించి గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తారు అని విజ్ఞప్తి చేయడం జరిగింది.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామస్తులు ఏర్పాటు చేసుకొను వినాయక మండపాలకు తప్పనిసరిగా ఆన్ లైన్ దరఖాస్తులు చేసుకోని పోలీసు శాఖ అనుమతి పొందాలని రాజవొమ్మంగి ఎస్ఐ వెంకయ్య తెలిపారు,ఈ అనుమతి సింగల్ విండో విధానంలో మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా https://ganeshutsav.net/ వెబ్ సైటు లో పూర్తి సమాచారం జతపరిచి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు,దీనితో పాటు పోలీసు శాఖ సూచనలు,సలహాల మేరకు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టి,మండపం నిర్వహణ మరియు పండుగ జరుపుకోవాలని తెలిపారు.

ప్రాణ ఆస్తి నష్టం జరగకుండా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శనివారం రాత్రి 11:30 గంటల నుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఎస్పీ, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, జిల్లా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. అదేవిధంగా ఆదివారం మధ్యాహ్నం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలో ఐటీడీఏ స్థాయిలో జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసే విధంగా విధులు కేటాయించారు. ఎటువంటి ప్రాణ నష్టం ఆస్తి నష్టం పశు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వాడు పడిన భవనాలు పాడుపడిన పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాలు, మట్టి ఇల్లు గుర్తించి ఆయా ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అదేవిధంగా పాడైన కల్వర్టులు, లో లెవెల్ కల్వర్టులు, పాడైన విద్యుత్ స్తంభాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బండ రాళ్లు జారిపడే అవకాశం ఉన్నందున ఘాట్రోడ్లలో రాత్రిపూట ప్రయాణాలను నిషేధించాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్కు తగు చర్యలు తీసుకొని ప్రయాణికులకు సమస్యలు లేకుండా చూడాలన్నారు. అన్ని ఆసుపత్రిలో అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలన్నారు.

జరగబోవు నష్టాలను ముందే గుర్తించండి : ప్రమాదం సంభవించిన తర్వాత నివేదికలు తయారు చేసే కంటే జరగబోవు ప్రమాదాలను నష్టాలను ముందే గుర్తించాలని కలెక్టర్ సూచించారు. అందుకు తగ్గ ఏర్పాట్లలో భాగంగా అందిన సమాచారాన్ని గ్రామస్థాయికి కన్వర్ట్ చేసి సంబంధిత గ్రామాలలో విస్తృత ప్రచారంగా ఉంచాలన్నారు. తద్వారా సాధారణ సమాచారం అందించే కంటే ప్రత్యేకమైన సమాచారాన్ని సంబంధిత గ్రామాలకు చేరవేయడం సులువవుతుందన్నారు. అందులో భాగంగా, గ్రామస్థాయిలో ఉన్న కల్వర్టులలో పాడైన కల్వర్టులు, లో లెవెల్ కల్వర్టులు, కాజ్ వేలు, మట్టి నిర్మాణాలు, కచ్చా గృహాలు, పాడైపోయిన ప్రభుత్వ ప్రైవేటు భవనాలు, పాఠశాలలు, అంగన్వాడీలను గుర్తించి ప్రొఫార్మ సిద్ధం చేయడం ద్వారా ఒక డాక్యుమెంటేషన్ తయారవుతుందని, దాని ప్రకారం భవిష్యత్తులో ఎటువంటి నష్టాలు జరగకుండా చేపట్టవచ్చని కలెక్టర్ సూచించారు. మండలం, సచివాలయం, హాబిటేషన్, నిర్మాణ శైలి, నిర్మాణ వయసు, ప్రస్తుత స్థితి, సురక్షితమా కాదా మొదలగు అంశాలతో ప్రొఫార్మాలను సచివాలయ సిబ్బంది ద్వారా సేకరించి డాక్యుమెంటేషన్ చేయాలని ఆదేశించారు. కల్వర్టు కూలిపోతే ఏ ఏ గ్రామాలకు నష్టం వాటిల్లుతుంది, ఎంతమంది ప్రజలు సమస్యను ఎదుర్కొంటారు, అటువంటి పరిస్థితుల్లో వారిని ఎక్కడ సురక్షిత ప్రాంతాలకు చేర్చాలి లాంటి వివరాలు పొందుపరచాలన్నారు. తద్వారా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి నష్ట నివారణకు చర్యలు తీసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ చేస్తున్న మరణకాండను ఆపాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఆందోళన కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు ఉపాధ్యక్షులు రెడ్డి వేణుమాట్లాడుతూ,ప్రపంచ శాంతికి అమెరికా, నాటో దేశాల సామ్రాజ్యవాదం విఘాతం కలిగిస్తుందన్నారు. ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల ఇప్పటికి 40000 మంది పాలస్తినా పౌరులు మరణించారని, ఇందులో మహిళలు చిన్నపిల్లలే 20వేల మంది పైగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ఆయుధ సంస్థల లాభాలకు మూడవ ప్రపంచ దేశాలలో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయని, ముడి సరుకు రవాణాకు అంతరాయం కలగడంతో పరిశ్రమలు నడవక నిరుద్యోగం పెరుగుతుందని, మొత్తంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి నెట్టబడుతున్నాయని విమర్శించారు. బిజెపి మతోన్మాద పార్టీ అధికారంలోకి రాగానే భారత అలీన విదేశాంగ విధానానికి తిలోదకాలు ఇచ్చి గాజా ప్రజలపై జరిగే యుద్ధంలో ఇజ్రాయెల్ సైన్యానికి ఆయుధాలు సరఫరా చేసి దేశప్రతిష్టను మంటగలుపు తుందన్నారు. ఇందు కోసమే భారత డిఫెన్స్ సెక్టార్ని ప్రేవేటికరణ చేసిందని గుర్తుచేశారు. అమెరికా, నాటో దేశాలు సిరియా, లిబియా, ఇరాక్ వంటి అనేక దేశాల్లో అంతర్యుద్ధాలను సమర్థిస్తూ ఆయుధాలు అందిస్తుందన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు చేతుల్లో పేలే ప్రతీ తూటా మేడ్ ఇన్ అమెరికా నుండి వస్తుందని గుర్తుచేశారు. ప్రపంచ కార్మికవర్గం ఈ సామ్రాజ్యవాద యుద్ధాలను వ్యతిరేకించాలని, ప్రపంచ శాంతికై నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గొర్లె వెంకటరమణ, సూరిబాబు, జ్యోతి, శాంతి, శాంతిమైన సంఘం నాయకురాలు వి ఇందిరా, రాజశేఖర్ దేవిడ్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి : డిడి అన్నాదొరై

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలో నిర్వహించబడుతున్న ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో సుమారు 25 వేల మంది ఆదివాసి విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ వసతి గృహాల్లో ఉంటున్నారని వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానోపాధ్యాయులు మరియు వసతి గృహ వార్డెన్లు, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (హెచ్‌డబ్ల్యుఓ)లు అందరికీ ఆదివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేయడం జరిగిందని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ అన్న దొరై తెలిపారు. అన్ని వసతి గృహాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన జీవో నెంబర్ 8 ప్రకారం ఒకే మెనూ అమలు చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం సప్లై చేస్తున్న గ్యాస్ వాడాలని, ఫైర్ వుడ్ వాడొద్దని తెలిపామన్నారు. జిసిసి ద్వారా సప్లై చేస్తున్న సరుకులు కాలపరిమితి అయిన సరుకులు వెంటనే రిటన్ చేయాలని నాణ్యమైన కూరలు పళ్ళు గుడ్లను టెండర్ యజమానులు సప్లై చేయాలని అలా నాణ్యమైన సరుకులు సప్లై చేయనీ యెడల ఐటిడిఏ అధికారులకు డిడి కార్యాలయానికి తెలిపిన ఎడల వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుంద అన్నారు వసతి గృహ సిబ్బంది రికార్డ్స్ పక్కాగా మెయింటెన్ చేయాలని ఆదేశించామన్నారు, విద్యార్థులు మల విసర్జన నిమిత్తం బయటకు వెళ్లకుండా పాఠశాల ఆవరణలో ఉన్న టాయిలెట్స్ వాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, సబ్జెక్ట్ టీచర్లు అంతా విద్యార్థులకు విద్యా బోధన సులభమైన రీతిలో అందించాలన్నారు, వసతి గృహాల మెడల పైన విద్యార్థులు చిరిగిన పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు, పడి వేయడం వలన వర్షాకాలంలో నీరు నిల్వలు ఉండి పోవటం వలన ఈగలు, దోమలు చేరి విద్యార్థులకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని, అందువలన పాఠశాల మేడ పైన పరిశుభ్రత చేయాలని తెలియజేశామన్నారు, విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి సహబంతి భోజనం చేయాలని తెలిపారు, త్రాగునీరు ఆర్వో ప్లాంట్లు కండిషన్లో ఉండే విధంగా చూసుకోవాలి అన్నారు, వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఎవరికి ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు, ప్రభుత్వం గిరిజన విద్యార్థుల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని, అదేవిధంగా ప్రత్యేక అధికారులు వసగృహాలను పర్యవేక్షణ చేసే విధంగా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారు ఆదేశాలు జారీ చేశారన్నారు.

బాధిత నిర్వాసితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణంపై పెట్టిన శ్రద్ధ, బాధిత నిర్వాసితులకు న్యాయం చేయడంపై పెట్టాలని అల్లూరి సీతారామరాజు జిల్లా వి.ఆర్.పురం మండల బీసీ కాలనీ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శనివారం గ్రామసభ ఏర్పాటు చేసి జరుగుతున్న అన్యాయం పై సమీక్ష సమావేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోదావరి వరదలు వచ్చే సమయంలోనే పోలవరం నిర్వాసితులు గుర్తొస్తున్నారని మూడు నెలల పాటు వరదలతో నరకయాతన అనుభవించామని, వరద తగ్గిపోతే నిర్వాసితులను పట్టించుకోవట్లేదనీ వాపోయారు. బీసీ కాలనీలో గత ప్రభుత్వం హయాంలో సర్వేలు జరిగాయని ఆ సర్వేల్లో తమ గ్రామం ఉన్నప్పటికీ సుమారు నూట ఎనభై కుటుంబాలు సర్వేలో లేవని చెప్పారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయమైన పద్ధతిలో విచారణ జరిపి గత వరదల సమయంలో నీట మునిగిన గ్రామాలు ముంపు జాబితాలోకి తీసుకొని సర్వే చేయాలని ప్రస్తుతం గ్రామంలో 180 కుటుంబాలు జాబితాలో లేకపోవడంపై నిరసన తెలియజేశారు. ఇప్పటికీ వడ్డిగూడెం పంచాయతీలో బీసీ. కాలనీ గ్రామం ఉన్న తమ ఇల్లు మాత్రం రేకపల్లి పంచాయతీ పరిధిలోకి వస్తుందని గతంలో ఆందోళన చేసిన అధికారులు హడావుడి చేసి తూతూ మంత్రంగా సర్వేలు చేసి వెళ్లిపోయారని ఇప్పటికీ బీసీ కాలనీ జాబితాలో లేదంటున్నారని, 2022 వరదలు వచ్చినప్పుడు సుమారు వారానికి పైగా ఇల్లు వదిలి పునరావాస కేంద్రాలకు వెళ్లామని గుర్తు చేశారు. తప్పుడు తడకలు సర్వేలు చేసి తమకు అన్యాయం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సర్వే చేపట్టి తగిన న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వంపూరు గంగులయ్య సమక్షంలో జనసేన పార్టీలో చేరిన దామనపల్లి గ్రామస్తులు

విశాలాంధ్ర-జికె వీధి : గూడెం కొత్త వీధి మండలం దామనపల్లి పంచాయతీ, దామనాపల్లి గ్రామానికి చెందిన యువకులను అరకు పార్లమెంట్, పాడేరు అసెంబ్లీ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వంపూరు గంగులయ్య మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు జనసేన పార్టీలోనికి యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని, పార్టీ ఆదేశాలకు కట్టుబడి, నియమాలు నిబద్ధత పాటించే వారికి పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందని తెలిపారు. దామనపల్లి పంచాయతీలో జనసేన పార్టీ కోసం పనిచేసిన జన సైనికులు సీదరి మత్స్యరాజు ప్రోత్సాహంతో యువకులుజనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీలో చేరిన వారిలో దామనపల్లి వార్డు సభ్యురాలు భర్త మాతే సోమరాజు,మాదల సతీష్, బురిడీ సతీష్,వి.సతీష్, చెర్రేకి బాలి, మాదల నారాయణ, కేపరి వెంకట్, కూడా చంటిబాబు, ఉల్లి కర్రయ్య తదితరులు ఉన్నారు. వీరందరినీ జనసేన పార్టీ నాయకులు డాక్టర్ వంపూరి గంగులయ్య కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం, జీకే వీధి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, చింతపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షుడువంతల బుజ్జిబాబు, పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ గొర్లె వీర వెంకట్, ఇతర జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంగి ప్రవహిస్తున్న శబరినది, సోకిలేరు

రెండు రాష్ట్రాల మధ్య స్తంభించిన రాకపోకలు

విశాలాంధ్ర-చింతూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు శబరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో చింతూరు మండలానికి, విఆర్ పురం మండలానికి రాకపోకలు బంద్ అయ్యాయి. చింతూరు మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలలోని సుమారు ఇరవై గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. చింతూరు-కుయుగూర్ గ్రామాల మధ్య శబరి నది ఎగపోటుకు గురవడంతో 326 జాతీయ రహదారి ముంపుకు గురైంది. దీనివల్ల ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా శబరి పరివాహక ప్రాంతాన్ని ఐటిడిఏ పి ఒ అపూర్వ భరత్ ఆదివారం చూటూరు, ముకునూరు, ఏజి కోడేరు, ఉలుమూరు గ్రామాలను సందర్శించారు. కోడేరు -ఉలుమూరు గ్రామాల మధ్య వాగు వాగు పొంగి ప్రవహిస్తు వుంది. దాని లోనుండి గిరిజనులు నడుస్తుండటం చూసి మానవత్వం తో తాను సిబ్బంది కారు దిగి గ్రామస్తులను కార్లో ఎక్కించి వాగు దాటించారు. ప్రమాదకర సంఘటనలు జరక్కుండా ప్రతివాగు వద్ద ఇద్దరు పోలీసులను, రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఉంచారు. ప్రతి వాగు వద్ద ఒక నాటు పడవని ప్రజలను అటు ,ఇటు దాటవేయడానికి సిద్ధంగా ఉంచారు.

పీహెచ్‌కి తరలిస్తుండగా మార్గ మధ్యలో ప్రసవం

విశాలాంధ్ర-మారేడుమిల్లి : వైరామవరం మండలం బొడ్డ గుంట గ్రామానికి చెందిన పల్లాల వీరలక్ష్మి(23) ఆదివారం పుట్టినప్పులతో బాధపడుతుండగా భర్త108కి ఫోన్ చేశారు. మారేడుమిల్లి పిహెచ్సికి 108లో తరలించ డానికి వాహనం వెళ్తుండగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వాగు పొంగి వాహన వెళ్లడానికి కుదరకపోవడంతో 108 సిబ్బంది గ్రామస్తులు సహాయంతో వాగు దాటిస్తుండగా వీరలక్ష్మికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108లో సిబ్బంది పురుడు పోశారు వీరలక్ష్మి మగ బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరంమారేడుమిల్లి పిహెచ్‌సిలో జాయిన్ చేశారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈఎంటి సుజాత, పైలెట్ శంకరును గ్రామస్తులు అభినందించారు.

వాగుల వద్ద పోలీస్ పీకేటింగ్

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో వాగులు,చెరువులు పొంగి ప్రవహిస్తుతున్నాయి,దీంతో అప్రమత్తమైన రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, శాంతి నగర్,నెల్లిమెట్ల, ఎర్రంపాడు,కొండపల్లి వాగులు వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేసి,ఎవరు వాగులు దాటకుండా చర్యలు చేపట్టారు,పొంగి ప్రవహిస్తున్న వాగులమీద కాలి నడకన, వాహనాల పై వెళ్లకూడదని, సురక్షతమైన ప్రాంతాల్లో ఉండాలని, అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఎవరు బయటకు రావద్దని, చెరువుల్లోకి ఎవరు చేపల వేటకువెళ్ళవద్దని సీఐ తెలియజేశారు. రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, మండల పరిధిలో ఎక్కడైనా రహదారులపై అడ్డంగా చెట్లు పడిన, వాగులు పొంగి ప్రవహించిన పోలీస్ వారికి తెలియజేయలని కోరారు.

జోరువానలో విద్యుత్‌శాఖ సేవలు

విశాలాంధ్ర-పాచిపెంట : వర్షాభావ ప్రభావంతో విద్యుత్ లైనులకు అంతరాయం ఏర్పడినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది జోరు వానలో వారి సేవలు అందించడం జరుగి0ది. మండల కేంద్రంలోని పాచిపెంట మేదరవేది సమీపంలోగల విద్యుత్ వైర్ నుండి విద్యుత్ సరఫరా రాకపోవడంతో ఆదివారం సెలవు దినమైనప్పటికీ పై అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత వినియోగదారు విద్యుత్ సరఫరా కావడం లేదని సమాచారం అందించడంతో సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ ఏఈ సింహాచలం, లైన్‌మాన్ ఎల్లయ్య సిబ్బంది విద్యుత్ లైన్ల పునరుద్ధరణలో పాల్గొని విద్యుత్ పునరుద్ధరించారు.

పర్యావరణ హితమే ప్రజాహితమని నమ్మిననేత పవన్‌కళ్యాణ్

జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్ గంగులయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : పర్యావరణహితమే జన హితం అని నమ్మిన నేత జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ అని ఆ పార్టీ అరకు పార్లమెంట్ ఇంచార్జ్ వంపూరు గంగులయ్య అన్నారు. ఆదివారం ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం తో కలసి చింతపల్లి వచ్చిన ఆయన ఆ పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వనం మనం బ్యానర్ చేత బూని పర్యావరణ హితమే.. జన హితం. మొక్కలు పెంచు.. పర్యావరణాన్ని పరిరక్షించు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా, అటవీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే పర్యావరణం పరిరక్షించబడాలని తద్వారా సకాలంలో వర్షాలు కురవడమే గాక పాడిపంటలకు కొదువ ఉండదని, అదే క్రమంలో ప్రాణ వాయువు పుష్కలంగా లభించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మా కి నామ్ పే ఏక్ పేడ్ (అమ్మ పేరిట ఒక మొక్క) పేరిట కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ మొక్కలు నాటే కార్యక్రమం తో పాటు, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది అన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నం కాబడ్డాయన్నారు. ఆర్థిక సంక్షోభం ఏర్పడిందన్నారు. పంచాయతీల పరిస్థితి దయనీయంగా తయారయిందన్నారు. సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా చేసిన ఘనత నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను కూడా పక్కదారి పట్టించిన ఘనాపాటి జగన్మోహన్ రెడ్డి అన్నారు. అటువంటి కష్టమైన క్లిష్ట పరిస్థితులలో ఉన్న పంచాయతీలకు పరి పుష్టిని తీసుకువచ్చేందుకు పవన్ కళ్యాణ్ రూపకల్పన చేశారన్నారు అందులో భాగంగానే రాష్ట్రంలో అన్ని పంచాయతీలలోనూ ఏకకాలంలో గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలపై తీర్మానాలు చేయించిన ఏకైక నేత పవన్ కళ్యాణ్ అన్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం కాకుండా ప్రజాభాగస్వామ్యంతో గ్రామసభల తీర్మానాల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడమే పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యం అన్నారు. ఆ విధంగా దశ దిశ చూపి చరిత్ర పుటల్లో నిలిచిపోయే నిర్ణయాలను పవన్ కళ్యాణ్ తీసుకుంటున్నారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర లక్ష్యంగా చెత్తాచెదారాలను శుభ్రం చేయడంతో పాటు మొక్కలు నాటి గ్రీన్ ఆంధ్రా దిశగా జనసేన శ్రేణులు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జీకే వీధి మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, చింతపల్లి మండల ఉపాధ్యక్షుడు కీముడు కృష్ణమూర్తి (పండు), ప్రధాన కార్యదర్శి సాయిరాం, యువజన(యూత్) అధ్యక్షుడు గాజుల శ్రీను, పార్లమెంట్ వర్కింగ్ కమిటీ వీర వెంకట్, సుర్ల వీరేంద్ర కుమార్, దూనబోయిన రమణ, తాటిపాకల రమేష్, సోషల్ మీడియా ఇన్చార్జ్ శెట్టి స్వామి, వజ్రపు రాజకుమారి, రాజుబాబు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తుఫాను చర్యలు పరిశీలన

పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఓలు, వైద్య సిబ్బంది

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని 35 గ్రామపంచాయతీలో కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఆదివారం నాడు అందుబాటులో ఉండే తుఫాన్ చర్యలను పరిశీలించారని మండల పంచాయతీ విస్తరణ అధికారి కుమార్ వర్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఉండి ప్రభుత్వ ఆదేశాలను ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశారు. ఇదిలాఉండగా తహశీల్దార్ రాములమ్మ, ఉపతహశీల్దార్ ఉమామహేశ్వరరావు, రెవిన్యూ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు మండల తహసిల్దార్ కార్యాలయంలో శనివారం నుండి నిరంతరముగా ఉండి ప్రభుత్వ ఆదేశాలను అమలుచేస్తూ తుఫాను పట్ల అప్రమత్తతగా ఉండాలని తెలియజేశారు. సువర్ణముఖి నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు నదిలో దిగవద్దని ఎప్పటికప్పుడు సూచిస్తూ వారిని అప్రమత్తం చేశారు. సీతానగరం ఎస్సై రాజేష్ కూడా తన సిబ్బందితో సువర్ణముఖినది పరివాహక ప్రాంతంలో ప్రజలు నదిలో దిగవద్దని సూచిస్తూ సూచనలు చేశామని తెలిపారు. పలు గ్రామాలను సందర్శించామన్నారు. తుఫాను దృష్ట్యా గ్రామాల్లో అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడిపదార్థాలు తినాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వైరల్ జ్వరాల నుండి అప్రమత్తంగా ఉండాలని సీతానగరం పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఉషారాణి ,పావని, రాధాకాంత్ లు పిలుపునిచ్చారు. వైద్య సిబ్బంది కూడా గ్రామాల్లో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజలు అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమంగా 600 సిమెంట్ బస్తాలు తీసినవారిపై చర్యలు తీసుకోవాలి

- రైతు బరోసా కేంద్రము నిర్మాణం చేయాలి
- సిపిఎం డిమాండ్

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో తూరు మామిడి గ్రామంలో రైతు బరోసా నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా నిధుల్లో సిమ్మెంట్ 600 బస్తాలు ఇంజినీరింగ్ అధికారులు ఏమి ఆయ్యోయో తెలియదని పత్రికా ముఖంగా తెలియజేయడంతో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగు నాయుడు రైతులతో కలసి తూరుమామిడిలో రైతు భరోసా కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రానికి కేటాయించిన స్థలంలో కనీసం తప్పులు, డొంకలు జంగిల్ క్లియరెన్స్ కూడా చేయకుండా 600 బస్తాల సిమెంట్ ఇంజనీరింగ్ అధికారులు ఎలా రిలీజ్ చేశారన్నారు. ఈ 600 బస్తాల సిమెంటు ఎవరు వినియోగించారో తేల్చాలని దానిపై సమగ్ర విచారణ చేసి ఇంజనీరింగ్ అధికారులపై 600 బస్తాల సిమెంటు వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అలాగే తూరుమామిడి లో రైతు భరోసా కేంద్రానికి బిల్డింగ్ లేకపోవడం వలన రైతు భరోసా కేంద్రాన్ని స్కూలు ఆవరణలో విద్యార్థులకు దగ్గరగా ఉన్న స్కూలు రూములలో నడుపుతున్నారని స్కూలు ఆవరణలో రైతు భరోసా కేంద్రాల నడపకూడదని గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని అయినా వ్యవసాయ శాఖ అధికారులు స్కూల్ ఆవరణలోనే తూరుమామిడి లో రైతు భరోసా కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని దీనివలన విద్యార్థులకు పురుగుమందులు, ఎరువులు తాలూకా విష ప్రభావం సోకి అనారోగ్యం పాలు అవడానికి అవకాశం ఉన్నదని కాబట్టి వెంటనే తూరుమామిడి లో రైతు భరోసా కేంద్రాన్ని స్కూల్ అవరణ నుండి బయట పెట్టాలని డిమాండ్ చేశారు స్థానిక సర్పంచ్ రైతు భరోసా కేంద్రానికి స్థలం లేదని అక్కడక్కడ చెప్తున్నారని ఇది సరైనది కాదని మండల రెవెన్యూ అధికారులు గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తూరుమామిడి లో రైతు భరోసా కేంద్రం నిర్మించడానికి కేటాయించిన స్థలాన్ని హద్దులతో సహా సమర్పించారని అదే కాపీని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అప్పచెప్పారని అయినా ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు వెంటనే రైతు భరోసా కేంద్రానికి కేటాయించిన స్థలంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించాలని లేకపోతే రైతులతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల అధ్యక్షునిగా వాసుదేవరావునాయుడు

విశాలాంధ్ర-బెలగాం : జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశంను స్థానిక రైతు బజార్ సమీపంలో ఉన్న ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించినట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్.జి.ఎఫ్ డిడి గాంధీ, మురళీకృష్ణ, ఎం. జకబ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల అధికారులుగా శ్రీకాకుళం జిల్లా నుండి ఎంవి రమణ, ఎస్. సాంబయ్య, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎన్. వెంకట నాయుడు వ్యవహరించారని, ఈ ఎన్నికల్లో పార్వతీపురం మన్యం జిల్లా నూతన అధ్యక్షులుగా మంతిన వాసుదేవరావు నాయుడు, జిల్లా కార్యదర్శిగా పత్తిక చంద్రమోహన్, జిల్లా కోశాధికారిగా గొద్దు చక్రవర్తి, గౌరవాధ్యక్షులుగా మజ్జి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు.

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి పార్వతిపురం మన్యం జిల్లా కమిటీ ఎంపిక ఆదివారం జరిగింది.జిల్లా అధ్యక్షులుగా వంగల దాలి నాయుడు, ఉపాధ్యక్షులుగా రేజేటి దయామణి , అధికార ప్రతినిధిగా సిగడం భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా వారణాసి వెంకటరమణ, కార్యదర్శులుగా టి.నవీన్, చుక్క చంద్ర రావు, పార్వతీపురం పట్టణ అధ్యక్షులుగా మేడిశెట్టి ఈశ్వర రావు, ఉపాధ్యక్షులుగా పిన్నింటి తులసీదాసు, గడసాన గంగరాజు, ప్రధాన కార్యదర్శిగా కోరాడ కాళీ కుమార్, కార్యదర్శులుగా వండాన నేతాజీ, సారిక దుర్గారావు, పల్లి సంతోష్, సోంట్యాన శ్రీను, కురుపాం నియోజకవర్గం కన్వీనర్ గా నెల్లి లక్ష్మనాయుడు, పార్వతీపురం నియోజకవర్గం కన్వీనర్ గా ఏ.దుర్గాప్రసాద్, సాలూరు నియోజకవర్గం కన్వీనర్ గా పులి గౌరీశ్వర రావు, గరుగుబిల్లి మండల అధ్యక్షులుగా దుప్పాడ రాజేష్ కుమార్ కొమరాడ మండల అధ్యక్షులుగా మొంజి సింహాచలం, జిఎం వలస మండల అధ్యక్షులుగా బడే రాంబాబు, గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షులుగా టీ. కిరణ్ కుమార్ కుమార్, కురుపాం మండల అధ్యక్షులుగా మోనంగి పృథ్వీరాజ్, పార్వతీపురం అధ్యక్షులుగా తామరకండి తేజ, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, సీతానగరం మండల అధ్యక్షులుగా పాటి శ్రీనివాస్ రావు లను ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు చెరువులను రక్షించాలని నినాదాలు చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో నిర్వీర్యం

నిరంతరంగా నిలిచిపోతున్న బిఎస్ఎన్ఎల్ సేవలు
వినియోగదారులల్లో రేకెత్తుతున్న అనుమానాలు

విశాలాంధ్ర-పాడేరు : గత ప్రభుత్వంలో మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా సెల్లు కనెక్టివిటీ ఏర్పరిచి గిరిజన యువతకు, గిరిజనులకు అత్యవసర పరిస్థితుల్లో ఫోన్లో అందుబాటులో ఉండాలి ఎంతో ఆర్భాటంగా వందల సంఖ్యల్లో సెల్ టవర్లు ఏర్పాటు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సెల్ సిగ్నల్ అందుబాటులోకి రాలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా వందల సంఖ్యలో ఏర్పాటుచేసిన సెల్ టవర్ లో ప్రైవేటు సంస్థల కేటాయించడం ప్రభుత్వ రంగ సంస్థల అయినటువంటి బిఎస్ఎన్ఎల్ టవర్లు ఎక్కువ ఏర్పాటు చేయకపోవడంతో ఈ ఇబ్బందులుమరి ఎక్కువైందని చెప్పొచ్చు. ఎప్పటినుంచో గిరిజన ప్రాంతంలో నిరంతరంగా సేవలందిస్తున్న బిఎస్ఎన్ఎల్ ని నిర్వీర్యం చేసి కొత్తగా ఏర్పాటుచేసిన ప్రైవేట్ సంస్థల సెల్ టవర్లకు లబ్ధి చేకూర్చి వారి వినియోగదారులను పెంచడానికి కొందరు అధికారులు,వారికి సహకరిస్తూ నిరంతరార్యంగా బిఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం కలిగిస్తున్నారు. దీనికి ఉదాహరణ గత కొన్ని రోజులుగా రోజుకి సుమారు రెండు మూడు గంటలు సేవల నిలిచిపోవడమే ఇందుకు ఉదాహరణ చెప్పవచ్చు.ఇప్పటివరకుఅంతరయం లేకుండా నిరంతరంగా పనిచేసినటువంటి బిఎస్ఎన్ఎల్ సేవలు గత కొన్ని రోజులుగా నిలిచిపోవడంపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.ఇది కేవలం ప్రైవేటు యజమాన్య సంస్థలకు లబ్ధి చేకూర్చి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీరియం చేసే కుట్రగా సెల్ వినియోగదారులు ప్రజా సంఘాలు మేధావి వర్గాలు అభిప్రాయ వ్యక్తం పరుస్తున్నాయి. ఇప్పటికైనాసంబంధిత అధికారులు స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలు అంతరయం లేకుండా కొనసాగిస్తే బాగుంటుందని అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వంపై విమర్శలు తగదు : టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బారావు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన సంఘటనకు రాజకీయం చేసి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని టిడిపి మండల అధ్యక్షులు టి. సుబ్బారావు చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఫుడ్ పాయిజన్ అయి సుమారు పందమంది విద్యార్థులు అస్వస్థతకు గురవడం చాలా దురదృష్టకరమైన విషయం అన్నారు. ఆశ్రమ పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన సంఘటనపై వైసిపి నాయకులు రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. గతంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారయాంలో ఉన్నప్పుడు ప్రభుత్వంపై ఆరోపిస్తున్న ప్రస్తుత ఎమ్మెల్సీ కుంభ రవిబాబు ఎస్టి కమిషన్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టి ఏ ఒక్క ఎస్టీ విద్యార్థులు గానీ గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు ఉన్నాయని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం చేతిలో ఉన్నప్పుడు ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా, నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తూ ఎమ్మెల్సీ రవిబాబు జామ్గుడా ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యపై ప్రభుత్వపై నిందించడం ఆయనకి సరికాదని హిత బోధించారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, మాజీ సర్పంచ్ సిహెచ్ వెంకటరాజు, టిడిపి నాయకుడు ఎం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ వ్యతిరేకిస్తూ తాలుకా కేంద్రాల వద్ద నిరసన

విశాలాంధ్ర-బెలగాం : ప్రతి సంవత్సరం సెప్టెంబర్ ఒకటవ తేదీని సిపిఎస్ వ్యతిరేక దినం సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా శాఖ పార్వతీ పురం తాలూకా కేంద్రంలో నిరసన చేపట్టనున్నట్టు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, నల్లా బాలకృష్ణ తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకా కేంద్రాలలో ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్ని మండల శాఖల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల కేంద్రం ప్రతిపాదించిన పెన్షన్ విధానాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు వీరు తెలియజేశారు. ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం తప్ప మరే పెన్షన్ కూడా అంగీకరించేది లేదని స్పష్టంచేశారు. పార్వతీపురంలో నిరసన కార్యక్రమం తర్వాత జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కూడా నిర్వహించ నున్నట్లు తెలియజేశారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి అందుబాటులో ఉండాలి

డిప్యూటీ డిఎం&హెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహనరావు ఆదేశాలు

విశాలాంధ్ర-బెలగాం : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి అందుబాటులో ఉండాలని డిప్యూటీ డిఎం&హెచ్ఓ డాక్టర్ టి.జగన్మోహనరావు ఆదేశించారు. సీతానగరం మండలం పెదంకలాం పిహెచ్సీని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపి రికార్డులో నమోదు చేసిన జ్వర పీడితుల వివరాలపై ఆరాతీసి వారి ఆరోగ్య స్థితిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. పాము, తేలు కాటు తదితర విషపూరిత కీటకాలకు గురైతే అత్యవసర చికిత్సకు అవసరమైన ఇంజక్షన్ల లభ్యతతో పాటుగా మలేరియా, డెంగ్యూ, డయేరియా మొదలగు సీజనల్ వ్యాదులకు అవసరమైన నిర్ధారణ పరీక్షలు, మందులు లభ్యతను పరిశీలించారు. పిహెచ్సిలో సిద్ధంగా ఉంచాలన్నారు. వార్డులో బెడ్ల సంఖ్య, టాయిలెట్ గదులను పరిశీలించారు. పవర్ బ్యాక్ అప్ ఇన్వెర్టర్ పనితీరును పరిశీలించారు. వ్యాక్సిన్ వయల్స్ స్థితిని గమనించారు. ప్రథమ చికిత్స, డ్రెస్సింగ్ కార్నర్‌ను ఆసుపత్రిలో సిద్ధంగా ఉంచాలన్నారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలకు ఆరోగ్య పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తినా ఆ పరిధిలో ఉండే వైద్య సిబ్బంది వెంటనే స్పందించి అవసరమైన వైద్యాన్ని తక్షణమే అందించాలన్నారు. ప్రసవ సమయం దగ్గరగా ఉన్న గర్భిణీలను రిఫరల్ ఆసుపత్రుల్లో చేర్చాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని తాగాలన్నారు. నీటిస్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. మారుమూల గ్రామాల్లో అవసరమైన పరీక్షలు, మందులు అక్కడే అందుబాటులో ఉంచాలన్నారు. సంబంధిత శాఖల సిబ్బందితో ఎప్పటికప్పుడు కోఆర్డినేట్ చేసుకొని ఎక్కడ ఏ సమస్య తలెత్తినా వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య సిబ్బంది వారి పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు.

చాలీచాలని రాజ్మా చిక్కుళ్ళు మాకెందుకు : దారకొండ రైతుల నిరసన

విశాలాంధ్ర-జికేవీధి:గూడెం కొత్తవిధి మండలం, అమ్మవారి ధారకొండ గ్రామ పంచాయితీలో రాజ్మా చిక్కులు చాలీ చాలన విత్తనాలు ఇస్తున్నడంతో రైతులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాలికొండ, ఎ.ధారకొండకు సంబం దించిన అగ్రికల్చర్ అసిస్టెంట్ బలరామ్, రెండు పంచాయితీ లకు కలిపి చాలా తక్కువ విత్తనాలు వచ్చాయిన్నారు. రైతుకు 10 కె.జి.ల మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. కానీ రైతులు మాట్లాడుతూ ఒక రైతు 300, వందల కే జి లు దాటి విత్తనాలు వేస్తామన్నారు. అలాంటిది 10 కేజిలతో తాము వ్యవసాయం చేయలేమన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కనీసం ఒక కుటుంబానికి 100 కేజిలు రాజ్మా చిక్కుల విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలీ చాలానీ విత్తనాలు తో రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రాజ్మాచీక్కుళ్ళ విత్తనాలు, ప్రతి రైతుకు వంద కేజీలు దాటి ఇవ్వాలని అమ్మవారి ధారకొండ రైతులు, పి.బాలన్న, ఎ.సన్యాసిరావు, పి.రాజు, ఎ.సత్తిబాబు, పి.నాగేశ్వరావు కోరారు.

ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా అల్లంకి శ్రీనివాస్, పూజారి లీలా ప్రసాద్

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి, జికే వీధి ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ హాల్ వద్ద నిర్వహించిన చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలలో చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాల ఫోటోగ్రాఫర్లు సంయుక్తంగా శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఫోటోగ్రాఫర్ల సేవా సంఘంగా ఏర్పడి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్ష కార్యదర్శులుగా అల్లంకి శ్రీనివాస్, పూజారి లీల ప్రసాద్, ఉపాధ్యక్షునిగా గబులంగి రవిప్రసాద్, కోశాధికారిగా జి.నగేష్ లను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గోపి, ఉపాధ్యక్షులుగా సురేష్ ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, లీలా ప్రసాదులు మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో.రెండు మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్స్ సుమారు 70 మంది పాల్గొన్నారు.

ఏపీ రైతు సంఘం డిమాండ్స్ డే సందర్భంగా జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాలకొండ : పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం కొండాపురం గ్రామంలో గ్రామ అధ్యక్షులు బలగ దుర్గారావు ఆదివారం జెండా ఆవిష్కరణ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11వ తేదీన అఖిల భారత కిసాన్ సభ ప్రారంభ మహాసభ జరుపుకొనగా సెప్టెంబర్ 1వ తేదీన ఆనాటి బ్రిటిష్ వారి రైతు వ్యతిరేక విధానాలకు మరియు రైతు హక్కుల కోసం పెద్ద ఎత్తున నినాదం చేయడం జరిగింది. జమీందారీ విధానం రద్దు చేయాలని, అధిక పన్నులను నిలిపివేయాలని తదితర డిమాండ్స్ ను రూపొందించుకొని డిమాండ్స్ దేగా పిలుపునివ్వడం జరిగింది. ఆనాటి నుండి నేటి వరకు దేశవ్యాప్తంగా సంఘమున అన్ని గ్రామాల్లో జండాను ఆవిష్కరణ చేసి కోర్కెల దినాన్ని జరుపుకోవడం జరుగుతుంది అని అప్పలనాయుడు గుర్తు చేశారు. కరోనా కష్టకాలంలో కూడా కార్పొరేటర్ రంగాన్ని ప్రాతహిస్తూ వ్యవసాయ రంగంలో అడ్డంకుగా ఉన్న చట్టాలను రద్దు చేస్తూ రైతు వ్యతిరేక 3 నల్ల చట్టాలను నరేంద్ర మోడీ తీసుకురాగా, వాటిని వ్యతిరేకిస్తూ లక్షలాదిమంది రైతులు 13 నెలల కాలం పాటు ఢిల్లీ నడిబొడ్డున ఉద్యమాలు చేయగా, ఉద్యమాలను హేళన చేసిన నరేంద్ర మోడీ చివరకు తలవగ్గి చర్చలలో భాగంగా చట్టాలు రద్దు చేస్తానని,పంటల మద్దతు ధరల చట్టాన్ని చట్టబద్ధత కల్పిస్తానని, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ సిఫార్సులను అమలు చేస్తానని మాట ఇచ్చారు. కరోనా కష్టకాలంలో కూడా పరిశ్రమలన్నీ మూతపడగా కార్మికులు, వలస కార్మికులకు గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయం పనులు కల్పిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరచడంలో వ్యవసాయ రంగం పాత్ర మర్చిపోలేని గాని ఆయన గుర్తు చేశారు. ఆనాటి ఉద్యమ సందర్భంగా చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని చెప్పారు. రైతులపై ఉన్న కేసులు ఎత్తివేస్తామని ప్రకటించారు కానీ ఈనాటికీ ఏ ఒక్కటి అమలు చేయకపోవడం దురదృష్టం. మొన్న ఎన్నికలకు ముందు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తరపున గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు వ్యవసాయం చేయడం కష్టంగా ఉందని,రైతును ఆదుకోవటానికి సాగు సాయం 20 వేల రూపాయలు చేస్తానని మాట ఇచ్చారు.నేటికీ గద్దెనెక్కి మూడు నెలలు కావస్తున్నా, రైతుకు ఇదే సరైన వ్యవసాయ పెట్టుబడి సమయమని తెలిసినప్పటికీ విధాన పరమైన ప్రకటన అమలు చేయడం లేదు. ఎరువులు దొరక్క రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద కొన్న ఎరువులకు అదనపు ఎరువులు అంట గట్టి రైతుపై భారం వేస్తున్న వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. గతం వలె రైతు సేవా కేంద్రం (ఆర్ బి కే),వ్యవసాయ పరపతి సంఘం(పిఎసిఎస్) లలో రైతుకు కావలసిన అంత ఎరువు ఇవ్వకపోవడంతో ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం లేదని చెప్పొచ్చు.ఈనాటికి కూడా పంటల భీమా కిస్తీని ప్రభుత్వం ఆయా కంపెనీలకు చెల్లించకపోవడం వంటి చర్యలు రైతులలో ఆందోళనకు గురిచేస్తున్నదని, ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం అమలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలో ఉన్న జంపర్ కోట,తోటపల్లి కాలువల ఆధునీకరణ కు కావలసిన నిధులు విడుదల చేసి పనులు చేయాలని డిమాండ్ చేశారు. జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో కిమిడి రామ్మూర్తి (జిల్లా అధ్యక్షులు) కౌలు రైతుల సంఘం, గ్రామ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి రాయ రామకృష్ణ, కిమిడి త్రిపురాంతకరావు, బలగ ఆనందరావు,బి.పారి నాయుడు రాగోలు గోవిందరావు, కిమిడి సూర్యరావు, సాసుబిల్లి సూర్యారావు ఎస్.పారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ కోసం రక్తాన్ని దానం చేసిన జనసేన సైనికులు

విశాలాంధ్ర-సీతానగరం : జనసేన అధినేత, రాష్ట్ర ఉప-ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు సందర్భంగా మండలం నుండి జనసైనికులు రక్తదాన శిబిరంలోపాల్గొని రక్తదానం చేసినట్లు మండల జనసేన అధ్యక్షులు పాటి శ్రీనివాసరావు తెలిపారు. తనతోపాటు తామరకండి గ్రామానికి చెందిన దోకల జయశంకర్, అల్లు వినోద్ కుమార్ బేతనపల్లి నాగరాజు తదితరులు రక్తదానం చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలానికి చెందిన జనసేన నాయకులు ధనంజయ, రమేష్, సత్యనారాయణ, సాయికిరణ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా పార్వతీపురం, బొబ్బిలిలో గత రెండు రోజులుగా జరిగిన రక్తదాన శిబిరాల్లో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పెద్దఎత్తున పాల్గొని జనసేన సైనికులను అభినందించారు.

పని సర్దుబాటును మండల స్థాయిలోనే జరపాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చాంద్ భాషా

విశాలాంధ్ర-పార్వతీపురం : పదోన్నతులు, బదిలీలు చేపట్టకుండా పనిసర్దుబాటు చేయడంవల్ల ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని రాష్ట్ర కార్యదర్శి మరియు జిల్లా పరిశీలకులు సయ్యద్ చాంద్ భాష అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా శాఖ అధ్యక్షులు మహేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనివార్య పరిస్థితుల్లో చేపడుతున్నామని చెప్తున్న పనిసర్దుబాటును మండల స్థాయిలోనే చేయాలని,పాఠశాలలోని ఖాళీలను విద్యావాలంటీర్లను నియమించడం ద్వారా భర్తీ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని విమర్శించారు. పాత పెన్షన్ స్కీం తప్ప మరే ఇతర పెన్షన్ స్కీమును ఉద్యోగులు ఆమోదించేది లేదని, దీనికోసం ఎంతటి ఉద్యమాన్ని చేయడానికైన వెనుకాడేది లేదన్నారు. కార్యవర్గ సమావేశం అనంతరం రాష్ట్ర సంఘం %o% పార్వతీపురం తాలూకా కేంద్రంలో సిపిఎస్ మీద వ్యతిరేకి నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల బాలకృష్ణరావు, రాష్ట్ర కౌన్సిలర్ జి సూర్యనారాయణ, జిల్లా సబ్ కమిటీ సభ్యులు,15 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలను ఎస్టీ కమిషనర్ సందర్శన

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటలోగల పివిజిటి, ఏపీఆర్ఎస్ పాఠశాలలను ఎస్టీ కమిషనర్ డి శంకర్రావు హఠాత్తుగా సందర్శించారు. వసతి గృహాల్లో గల మరుగుదొడ్లు, వాటర్ ట్యాంకులను, వంటశాలలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థులకు వేడివేడి ఆహార పదార్థాలతో పాటు వేడి నీళ్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి తెలియజేశారు. పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. కాసేపు విద్యార్థులతో ముచ్చటించి, చదువుపై శ్రద్ధ వహిస్తూ ఇష్టంగా చదివి ప్రయోజకులు అవ్వాలని, మంచి మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. అనంతరం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శించి రోగులు ఉన్న రూములను పరిశీలించి రూములు, మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధులను పరిశీలించి మరింత మెరుగైన వైద్యం రోగులకు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఎస్టి కమిషనర్ వెంట కింతల పాండురంగ, గుడ్ల హరిప్రసాద్, ఏఎస్ఐ మహేష్ తదితరులు ఉన్నారు.

గ్రీవెన్స్ రద్దు



విశాలాంధ్ర - రంపచోడవరం : సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల వేదిక (గ్రీవెన్స్) భారీ వర్షాల కారణంగా రద్దుచేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం తెలిపారు. ఆదివారం పీఓ మాట్లాడుతూ గ్రీవెన్స్ భారీవర్షాల కారణంగా రద్దుచేయడం జరిగిందని అదేవిధంగా వర్షాల వలన ఏమైనా సమస్యలో ఉన్నఎడల దగ్గర్లో ఉన్న మండలల అధికారులకుగానీ ఐటీడీఏ కార్యాలయంలో, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కి తెలియపరచ వచ్చని ఆయన తెలిపారు.

మార్కొండపుట్టిలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టిగడ్డ వంతెన

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో మార్కొండ పొట్టి పంచాయతీలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిట్టి గడ్డవంతెన మీద ఆధారపడి దాదాపు 20 గ్రాములు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు చిన్న వర్షాలకు చిట్టి గడ్డ వంతెన ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. 20 గ్రాముల ప్రజలు ఆరోగ్య సమస్యల వ్యవసాయ పనులైన వ్యాపారస్తులకు గుర్తు కోసమైన పిల్లలు చదువులు అనేక అవసరాలకు చిట్టి గడ్డ వంతెన పైనే ప్రజలందరూ ఆధారపడి ఉన్నారు చిన్న వర్షం వచ్చినా చిట్టి గడ్డ వంతున ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల ప్రాణాలు అరచేతులు పెట్టుకొని వంతెన దాటుతున్నారు ప్రభుత్వం దీన్ని స్పందించి ప్రజలకు చిట్టి గడ్డ వంతెన నిర్మాణం ఏర్పాటు చేయాలని ప్రజలందరూ కోరుతున్నారు.